నైపుణ్య శిక్షణ.. అంతంత మాత్రమే..!

- స్కిల్ హబ్‌లో శిక్షణకు స్పందన కరవు
- ప్రచారానికి అంతగా ప్రాధాన్యమివ్వని అధికారులు
- యువత చెంతకు చేరని సమాచారం
- ఉపాధి అవకాశాల కల్పనలో కొరవడిన స్పష్టత
- మొక్కుబడిగా కోర్సుల నిర్వహణ


కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలోని స్కిల్ హబ్ కేంద్రం


జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కార్యాలయం

మురళీనగర్: ఎంతో సదాశయంతో ఉత్తర నియోజకవర్గ స్థాయిలో కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లో శిక్షణ అంతంత మాత్రంగానే సాగుతోంది. ఇక్కడ నిర్వహించే స్వల్పకాలిక ఉపాధి కోర్సులకు యువత నుంచి స్పందన కరవైంది. దీనికి సమాచార లోపమేనని కారణమని పలువురు చెబుతున్నారు. దీంతో యువతకు ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన స్కిల్ హబ్‌ల ఆశయం నెరవేరడం లేదు. నిర్దేశించిన కోర్సుల్లో సీట్ల భర్తీకి వీరు కిందా మీదా పడాల్సి వస్తోంది. యువతకు సమాచారం చేరవేడయం, వారిలో వీటిపై అవగాహనకు చైతన్య కార్యక్రమాలు నిర్వహించడంలో వీరు విఫలమవడమే దీనికి కారణమవుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఈ స్కిల్ హబ్‌లో కోర్సుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం కలినిపిస్తోంది. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కార్యాలయం ప్రాంగణంలోని హబ్ పరిస్థితే ఇలా ఉంటే.. మిగతా హబ్‌ల పరిస్థితి ఇక చెప్పనవసరం లేదు.

పేరుకే పరిమితం..

కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఏర్పాటు చేసిన నైపుణ్య శిక్షణ సంస్థ కేవలం పేరుకే పరిమితమైంది. గత ప్రభుత్వంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి పలు కోర్సులు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉద్యోగావకావకాశాలు కల్పించారు. షార్ట్‌టెర్మ్ కోర్సులు నిర్వహించి తరచుగా జాబ్ మేళాలు ఏర్పాటు చేసేవారు. దీనికి ప్రత్యేకంగా సిబ్బందిని నియమించడమే కాకుండా పలు కంపెనీల సీఎస్‌ఆర్ కార్యక్రమాల ద్వారా శిక్షణ, ఉపాధి అవకాశాల మెరుగుకు కృషి చేశారు. ఇప్పుడీ స్కిల్ హబ్‌కు రానురాను ప్రాభవం కోల్పోతోంది.

ఎందుకిలా..?

నియోజకవర్గ స్థాయిలో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌లు నేడు ఆశయాలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాయి. దీనికి ప్రధానంగా ప్రచారం, చైతన్య కార్యక్రమాల నిర్వహణలో వెనుకబాటే కారణమని నిపుణులు చెబుతున్నారు. ఎంఎస్‌ఎంఈల మాదిరిగా మోటివేటర్‌లు లేకపోవడం, ఒకే ఒక కోఆర్డినేటర్‌తో హబ్ మొత్తం కార్యక్రమాలు నిర్వహించడం ప్రధాన కారణంగా చెప్పవచ్చు. వీరి వద్ద ఆయా ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత సమాచారం లేకపోవడం వల్ల విద్యార్హతలు ఉండి కూడా ఖాళీగా ఉంటున్న యువతను వీరు చైతన్య పరచలేకపోతున్నారు. కనీసం నియోజకవర్గంలోని సచివాలయాలకు వెళ్లినా వీరికి ఇందుకు అవసరమైన సమాచారం దొరికేది. ఇక్కడ కోర్సులు నిర్వహిస్తున్న విషయం ఆయా ప్రాంతాల్లోని కార్పొరేటర్లకే తెలియని పరిస్థితి. కార్పొరేటర్ల సహకారం తీసుకోవడంలోనూ అధికారులు విఫలమవుతున్నారు. పైగా ఇంత వరకు ఇక్కడ ఉపాధి శిక్షణ పొందిన వారిలో ఎంతమందికి ఉపాధి కల్పించారో తెలియని పరిస్థితి. గ్రౌండ్ లెవిల్‌కు దీన్ని తీసుకెళ్లకపోవడం ప్రధాన లోపంగా కనిపిస్తోంది. ఈ లోపాలను సరిచేసుకుని స్కిల్ హబ్‌ల ఏర్పాటు లక్ష్యాల సాధనకు అధికారులు పక్కా ప్రణాళిక అమలు చేయాల్సి ఉందని పలువురు సూచిస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం ఈ స్కిల్ హబ్‌లో కార్యక్రమాల నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది. షార్ట్‌టెర్మ్ కోర్సుల నిర్వహణకు సంబంధించి యువతకు ఎటువంటి సమాచారం అందని పరిస్థితి. మొక్కుబడిగా పత్రికల్లో ప్రకటన ఇవ్వడంతో సరిపెట్టుకుంటున్నారు. దీంతో ఈ కోర్సుల్లో చేరడానికి అవసరమైన యువత ముందుకు వచ్చే పరిస్థితి కరవైంది. ఇంత వరకు ఇక్కడ రెండు షార్ట్‌టెర్మ్ కోర్సులు నిర్వహించారు. వారం రోజుల శిక్షణ కాలం కలిగిన ఆర్‌పీఎల్‌లో భాగంగా వెయిట్స్ అండ్ మెజర్‌మెంట్స్ కోర్సుల్లో ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఆ తర్వాత మూడు నెలల శిక్షణ కాల వ్యవధి కలిగిన అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్ కోర్సును నిర్వహించారు. ప్రతి కోర్సుకు కనీసం 30 మందికి అవకాశం ఉన్నప్పటికి పూర్తి స్థాయిలో సీట్లు భర్తీ చేయలేకపోయారు. ఎలక్ట్రికల్ కోర్సులో స్థానిక పాలిటెక్నిక్ కాలేజీ విద్యార్థులను చేర్చుకోవాల్సి వచ్చింది. కోర్సుల్లో చేరడానికి యువతను రప్పించడంలో విఫలమవుతున్నారు. కిందా మీదా పడి సేకరిస్తే 21 నుంచి 23 మందికి మాత్రమే శిక్షణ ఇవ్వగలిగారు. తాజాగా కంచరపాలెం పాలిటెక్నిక్ ప్రాంగణంలోని స్కిల్ హబ్‌లో టూవీలర్ సర్వీసెస్ అండ్ టెక్నిషియన్ కోర్సుకు ఏర్పాట్లు చేశారు. దీనికి సంబంధించి ప్రకటన వెలువడినా.. కోర్సులో చేరడానికి యువత నుంచి స్పందన కొరవడింది. ఈ నెల 23 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభించాల్సి ఉంది.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో తీవ్ర నష్టం


గురుద్వారా ఆర్చి వద్ద సంతకాలు సేకరిస్తున్న ముువ్వల పోలారావు

సీతంపేట: కూటమి ప్రభుత్వంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమాన్ని ఆదివారం 25వ వార్డులో మాజీ కార్పొరేటర్ మువ్వల పోలరావు, మువ్వల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గురుద్వారా ఆర్చి సమీపంలోని 133 పోలింగ్ బూత్ ఏరియాలో ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒకేసారి 17 మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అన్ని అనుమతులు తేవడం చరిత్రాత్మకమన్నారు. ఈ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరించాలనుకోవడం అనాలోచిత నిర్ణయమని, దానిని వ్యతిరేకిస్తూ భవిష్యత్తులో యువత ఎదుర్కొనే ఇబ్బందులను ప్రజలకు వివరించి ప్రతి గడపకు వెళ్లి సంతకాలు సేకరిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సానబోయిన సురేష్, సారిపిల్లి సంతోష్, నూకరాజు, శ్రావణ్‌కుమార్, పోతిబంతి హరికృష్ణ, బోర గోవింద్, మొందూరి అప్పలరాజు, ముద్దాడ అశోక్, పప్పు ప్రసాద్, బడే శ్రీను, జామి సిద్ధు, సూరిబాబు, దిమిలి శ్రీను, బొట్టా పైడిరాజు, అవుపాటి మహేష్, బోరపూడి శ్రీను, నమ్మి మహేష్, శంకర్, ముద్దాడ శ్యామ్, పరశురామ్, ధారకొండ చెల్లారావు, ఉప్పిలి రాంబాబు, బంధం అప్పారావు, మహిళలు ఉమ, అరుణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ప్రోత్సాహకాలు


మనోజ్‌కు చెక్కు అందిస్తున్న గంట్ల శ్రీనుబాబు

సీతంపేట: నిరంతరం సమాజం కోసం పాటుపడే జర్నలిస్టులతోపాటు వారి పిల్లలను ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉందని జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు అన్నారు. ఇద్దరు సీనియర్ జర్నలిస్టుల పిల్లలకు విద్యా, క్రీడా ప్రోత్సాహకాల కింద రూ.25 వేలను అక్కయ్యపాలెంలోని యూనియన్ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. సీనియర్ ఫొటో జర్నలిస్ట్ గణేష్ కుమారుడు మనోజ్‌యాదవ్‌కు రూ.10 వేలు అందించారు. చదువుతోపాటు కరాటేలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మనోజ్ రాణించడం అభినందనీయమన్నారు. మరో సీనియర్ జర్నలిస్ట్ కుమార్తె బీటెక్ చదువుకు రూ.15 వేలు అందజేసినట్టు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో 139 మంది జర్నలిస్టుల పిల్లలకు ఉపకార వేతనాలు అందించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ప్రతి ఇంటా కోటి సంతకాల సేకరణ


49వ వార్డులో సంతకాలు సేకరిస్తున్న కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ఆదివారం 49వ వార్డులోని 36వ పోలింగ్ బూత్ పరిధిలో జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల కలిగే నష్టాలను స్థానికులకు వివరించారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు ఐ.రవికుమార్, వార్డు జనరల్ సెక్రటరీలు జి.వెంకటరావు, కె.మంగ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు డి.వెంకటలక్ష్మి, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఆర్.చిన్నారావు, గ్రీవెన్ సెల్ అధ్యక్షుడు బి.సూరిబాబు, యూత్ అధ్యక్షుడు ఇ.రాజేష్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు వి.జగదీష్, పబ్లిసిటీ విభాగం అధ్యక్షుడు ఎస్.కనకమహాలక్ష్మి, సీనియర్ నాయకులు మురళీజాన్, ఆంథోనీ పాల్గొన్నారు.

హరేరామ హరేకృష్ణ మహామంత్రంతో ఏకాహం


ఏకాహం నిర్వహిస్తున్న కందర్ప రాధ, అభినయ్ తదితరులు

దాబాగార్డెన్స్: పాతనగరంలోని చెంగల్రావుపేట కోదండ రామాలయంలో ఆలయ ఈవో నీలిమ సహకారంతో రాగమయి సాంస్కృతిక సంగీత సంస్థచే హరే రామ హరేకృష్ణ మహామంత్రంతో 24 గంటల పాటు ఏకాహం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని గంటి అభినయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం కందర్ప రాధ, జి.అభినయ్, పలువురు భక్తులు సామూహికంగా హరేరామ హరేకృష్ణ మహామంత్రాన్ని సామూహికంగా ఆలపించారు. నిర్విరామంగా 24 గంటల పాటు నిర్వహించిన ఏకాహంలో ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, కొణతాల రాజు, విజయ రమణి, ఆలయ అర్చకుడు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అలరించిన లక్ష్మీప్రియ గాత్ర కచేరీ


కీర్తనలు ఆలపిస్తున్న లక్ష్మీప్రియ

దాబాగార్డెన్స్: రామ్‌నగర్ రాఘవేంద్రస్వామి మఠంలో ఐవీఎల్ శాస్త్రి సంగీత సమితి ఆధ్వర్యంలో వాగ్గేయకారుడు దీక్షితార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆదివారం ఆర్.లక్ష్మీప్రియ దీక్షితార్ రచించిన సంకీర్తనలు మధురంగా ఆలపించి అలరింపజేశారు. వయొలిన్‌పై కె.గాయత్రి వరేణ్య, మృదంగంపై పీవీఎస్ బాలాజీ యువరాజ్ వాద్య సహకారం అందించారు. అనంతరం కళాకారులను సంగీత సమితి తరఫున ఘనంగా సత్కరించారు. సమితి చైర్మన్ వెంకట్రావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త ఎంవీ రాజశేఖర్, వీవీబీ శంకరం, సమితి ప్రతినిధులు కె.సుబ్రహ్మణ్యం, పి.జగన్మోహనరావు, జి.మధుబాబు, మధుసూదనరావు, నాగేశ్వరరావు, సమితి సభ్యులు, శిష్యులు, భక్తులు పాల్గొన్నారు.

గురుస్వామి వసంతరావు ఇకలేరు


వసంతరావు (ఫైల్)

దాబాగార్డెన్స్: తూర్పు కోస్తా రైల్వేలో పీఏ టు డీఆర్‌ఎంగా పదవీ విరమణ చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ కార్యదర్శి వసంతరావు(79) మధుమేహ వ్యాధితో నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. డీబీకే రైల్వే క్వార్టర్స్‌లో లక్ష్మీ వరసిద్ధి వినాయక భవానీ శంకర ఆయాన్ని స్థాపించి, ఆలయ అధ్యక్షుడిగా చక్కటి సేవలందించారు. కేరళ శబరిమలై భక్తుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అఖిల భారత అయ్యప్ప సేవా సంఘానికి సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యునిగా రాష్ట్రం తరఫున సేవలందించారు. 82 సార్లు శబరిమలై అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. 41 సార్లు మకరజ్యోతి దర్శనం కూడా చేశారు. వసంతరావు అకాల మృతికి అఖిల భారత అయ్యప్ప సేవా సంఘం విశాఖ శాఖ సభ్యులు సంతాపం తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు కాన్వెంట్ జంక్షన్ సమీపాన గల హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

వెలుగుల పండగ.. జాగ్రత్తే శ్రీరామరక్ష



జిల్లాలోని అగ్నిమాపక కేంద్రాల ఫోన్ నంబర్లు

సూర్యాబాగ్ (విశాఖపట్నం సిటీ)	0891-2563582
బర్మాక్యాంప్ (విశాఖపట్నం సిటీ)	0891-2558470
పెదగంట్యాడ	0891-2517780
చిట్టివలస	08933-201337

అల్లిపురం: దీపావళి.. వెలుగులు విరజిమ్మే ఆనందాల పండగ. చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ ఉత్సాహంగా టపాసులు కాలుస్తూ సంబరాలు జరుపుకుంటారు. అయితే ఈ సంతోషం విషాదంగా మారకుండా ఉండాలంటే కాస్త అప్రమత్తత అవసరం. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా.. చిన్నపాటి అజాగ్రత్త వహించినా వెలుగుల పండగ జీవితంలో చీకట్లు నింపే ప్రమాదం ఉంది. విలువైన ప్రాణాలకు, ఆస్తులకు నష్టం వాటిల్లవచ్చు. కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా, ఈ దివ్వెల పండగను సురక్షితంగా, మరింత ఆనందంగా జరుపుకోవచ్చు.

కంటి సంరక్షణ చాలా ముఖ్యం

బాణసంచా కాల్చే సమయంలో కంట్లో నిప్పురవ్వలు పడినా లేదా పటాసులు తగిలినా ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. కంటిని రుద్దడం, నాటు పసరు వేయడం వంటివి అస్సలు చేయకూడదు. పటాసులు కాల్చేటప్పుడు కంటికి మొత్తం కవర్ చేసే రక్షణ అద్దాలు పెట్టుకుంటే చాలా మంచిది. నిప్పురవ్వలు కంటిపాపపై పడితే శాశ్వతంగా చూపు పోయే ప్రమాదం ఉంది. వృద్ధులు, చిన్నపిల్లలు వీలైనంత వరకు టపాసులు కాల్చే ప్రదేశాలకు దూరంగా ఉంచడం శ్రేయస్కరం.

– డాక్టర్ ఇమంది సత్య వరాహ శివ ప్రసాదరావు, నేత్ర వైద్య నిపుణులు

అప్రమత్తతే కీలకం

దీపావళి పండగను అందరూ ఆనందంగా జరుపుకోవాలి. ముఖ్యంగా పిల్లలు బాణసంచా కాల్చేటప్పుడు పెద్దలు పక్కనే ఉండటం తప్పనిసరి. ప్రమాదవశాత్తు ఏదైనా అనుకోని సంఘటన జరిగినప్పుడు 100, 101, 108లకు ఫోన్ చేయండి. అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటే దీపావళి పండగ ప్రతి ఒక్కరికీ ఆనందాన్ని పంచుతుంది.

– రమణయ్య, జిల్లా అగ్నిమాపక అధికారి

ఎక్కడి చెత్త అక్కడే..


ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఎదురుగా పేరుకుపోయిన చెత్త


మాధవధార-మురళీనగర్ 48 బస్ రూట్‌లో తొలగించని చెత్త

మురళీనగర్: మురళీనగర్‌లోని పలు ప్రాంతాల్లో చెత్త తొలగించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మాధవధార 48 బస్ రూట్‌లో రహదారి పక్కనే చెత్త పేరుకుపోయింది. దీన్ని తొలగించకపోవడంతో దుర్గంధం వ్యాపించి ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సెక్టార్–3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఎదురుగా చెత్తను తొలగించలేదు. ఇక్కడ తరచుగా చెత్తను వదిలేయడం పరిపాటిగా మారింది. జీవీఎంసీ శానిటరీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. జీవీఎంసీ అధికారులు స్పందించి చెత్త తొలగింపునకు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఏయూలో ప్రకృతి పంటల సంత విజయవంతం


ప్రకృతి పంటల సంతలో జలగం కుమారస్వామి, కేంద్ర కమిటీ సభ్యులు

మద్దిలపాలెం: ఏయూలోని 'ఆ హబ్'ప్రాంగణంలో భారత్ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ప్రకృతి ఆధారిత పంటల సంత విజయవంతమైంది. ఈ సందర్భంగా భారత్ కిసాన్ సంఘ్ కేంద్ర కమిటీ సభ్యుడు జలగం కుమారస్వామి మాట్లాడుతూ ఈ సంతకు విశేష స్పందన లభించిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రకృతి ఆధారిత పంటలనే ఆహారంగా తీసుకోవాలని కోరారు. ఈ ప్రకృతి ఆధారిత పంటల సంత ఇకపై ప్రతి ఆదివారం ఇదే వేదికపై క్రమం తప్పకుండా జరుగుతుందని వెల్లడించారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. వారాహి ఎఫ్‌పీవో సహకారంతో ఈ పంటలను నేరుగా వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ హబ్ సంస్థ ప్రతినిధి ఈశ్వరపు రవి, గో ఆధారిత ప్రకృతి పంటల రైతు సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మత్స్యకారుల మోముల్లో వెలుగు

సాగరంలో చేపల వేట మత్స్యకారులకు ఎప్పుడూ ఒక పోరాటమే. కానీ.. ఆదివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో కనిపించిన దృశ్యం ఆ కష్టానికి తగిన ఫలితాన్ని కళ్లకు కట్టింది. నిత్యం సాగరంలో వేట చేసే మత్స్యకారులకు ఆదివారం పంట పండింది. వారి బోట్లు నిండుగా మత్స్య సంపదతో ఒడ్డుకు చేరాయి. దీంతో వారి మోముల్లో సంతోషం వెల్లివిరిసింది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం






దీపావళి శోభతో మార్కెట్లు కళకళ


అక్కయ్యపాలెంలో ప్రమిదలు కొంటున్న మహిళలు


శంకరమఠం రోడ్డులో దీపావళి సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం

సీతంపేట: దీపావళి పండగ శోభతో ఆదివారం మార్కెట్లు కళకళలాడాయి. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్, దొండపర్తి, శంకరమఠం రోడ్, సీతంపేట, రామాటాకీస్, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతాల్లో ప్రమిదలు, పువ్వులు, విద్యుత్ దీప తోరణాలు, చెరుకు గడలు, ఆముదం కర్రలు, మామిడాకుల విక్రయాలతో మార్కెట్లు రద్దీగా మారాయి. అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డు జనంతో కిటకిటలాడింది. పిల్లలు ఇష్టపడే దీపావళి గన్స్ రీల్ కేపులు, రింగ్‌కేప్స్, మ్యాచ్ బాక్స్ గన్స్ కొనుగోళ్లతో సందడి నెలకొంది. సుమారు 50కు పైగా మోడల్స్‌లో చిన్న సైజు నుంచి పెద్ద సైజు వరకు గన్స్ విక్రయించారు. ప్రధాన రహదారుల్లో ఏర్పాటు చేసిన పలు దుకాణాల్లో ప్లాస్టిక్ గన్స్, మెటల్ గన్స్ ఆకర్షణీయమైన మోడల్స్‌లో షాపుల్లో విక్రయించారు. రూ. 50 నుంచి రూ.800 వరకు గన్స్, వివిధ రకాల బాణసంచా సామగ్రి దుకాణాల్లో లభిస్తున్నాయి.

హైదరాబాద్‌లో స్థానిక ప్రతిభకు పట్టం

నలుగురు కళాకారిణులకు 'నాట్యమయూరి' అవార్డులు


నృత్యం చేస్తున్న సంగివలసకు చెందిన రజనీరెడ్డి



నాట్యమయూరి అవార్డులు అందుకుంటున్న నాట్యరవళి అకాడమీ విద్యార్థులు

తగరపువలస: హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియం.. స్థానిక నృత్య కళాకారిణుల ప్రతిభకు వేదికైంది. నృత్యమాల నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ, సిరి ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 18న నిర్వహించిన నృత్య ప్రదర్శనల్లో తగరపువలస, సంగివలస ప్రాంతాలకు చెందిన నలుగురు కళాకారిణులు ప్రతిష్టాత్మక నాట్యమయూరి పురస్కారాలను కైవసం చేసుకున్నారు. తగరపువలసలోని నాట్యరవళి మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీకి చెందిన లిఖితసాయి, లక్ష్మీలహరి, గీతామాధురి తమ నృత్య ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వీరు కూచిపూడిలో జావళి, తరంగం, శబ్దం, అన్నమయ్య కీర్తనలతో పాటు కోయి రాలే, కోడిపందెం, కైకలూరి చిన్నదాన్ని వంటి జానపద నృత్య అంశాలను అద్భుతంగా ప్రదర్శించి ఉత్తమ ప్రదర్శనకుగానూ అవార్డులు గెలుచుకున్నారు. గతంలో వీరు తిరుపతి, రాజమహేంద్రవరం వంటి జాతీయస్థాయి వేదికలపైనా సత్తా చాటడం గమనార్హం. అదే విధంగా జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని సంగివలసకు చెందిన శ్రీ నృత్యప్రియ అకాడమీ నిర్వాహకురాలు చేట్ల రజనీరెడ్డి సైతం ఇదే వేదికపై నాట్యమయూరి అవార్డును అందుకున్నారు. ఆమె ప్రదర్శించిన అదివో అల్లదివో కూచిపూడి శాస్త్రీయ నృత్యం నిర్వాహకుల ప్రశంసలు పొందింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులను జాతీయ స్థాయిలో తీర్చిదిద్దిన నాట్యరవళి అకాడమీ డైరెక్టర్ ఉమ్మిడి మహేష్‌బాబును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.


నృత్య ప్రదర్శన చేస్తున్న తగరపువలసకు చెందిన లిఖితసాయి

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు


కప్పస్తంభానికి మొక్కుకుంటున్న సినీ హీరో ప్రదీప్ రంగనాథన్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని సినీ హీరో ప్రదీప్ రంగనాథన్(డ్యూడ్ సినిమా ఫేం) ఆదివారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అంతరాలయంలో ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు జరిపి, వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఆదివారం యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, విజయనగరం డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి దర్శించుకున్నారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు.